
# వాళ్ళు

వి. రాజారామమోహనరావు




**కష్టపడే బలమైన ఆ శరీరాల్లో రోగాలు నిలవ లేవు. కాని వాళ్ళలో ఉన్న అమాయికత చుట్టూ కమ్ముకున్నాయి రోగాలు. వంశానుగతంగా వచ్చే రోగాలు ఉంటాయని, వాటిని బాగు చేసుకోవడానికి మందులు ఉంటాయని తెలియని అజ్ఞానం వాళ్ళది.**

అర్ధరాత్రి ఎప్పుడేనా నడుస్తుంటే, ఆ ఆలోచన నన్ను తొలిచేస్తుంది.

అందులో సరిగ్గా అక్కడ ...

మా సన్నటి సందు పెద్దవీథిలో కలిసే మలుపు దగ్గర ... కొత్తగా కడుతున్న పెద్ద బిల్డింగు అరుగు మీద ...

అర్ధరాత్రి పన్నెండు దాటిన ఆ సమయంలో ఏం కనిపించదు. అరుగు చీకట్లో స్ట్రీట్ లైట్ సన్నటి వెలుతురు చేతులు తారట్లాడుతూంటాయి. వాటి తారట్లాట మధ్య అరుగుమీద ఇనప చువ్వల్లా నిగడదన్నిన మందపాటి గొంగళీ ముసుగులే కనిపిస్తాయి...

కాని ... నాకు ఆ చీకటి చీల్చి పోతూ ... ఆ ముసుగుల లోపల... మందపాటి ఆ గొంగళీల లోలోపల ఆకారాలు కనిపిస్తాయి... ఆ బలం నా చూపుల్ది కాదు... నన్ను తింటున్న ఆలోచనది ...

ఎప్పుడో సరిగ్గా గుర్తులేదు. ఇంచుమించు ఓ నెల క్రితం చూశాను తనని ... పొద్దున్నే ... ఇంకా ఎడు కూడా కాలేదు... సూర్యుడి పల్చటి

వెలుగు మెత్తటి సూదుల్లా ఆ అరుగు అంచుల్ని తాకుతూం దప్పుడు.

చేతుల కున్న దంతం గాజులు చప్పుడయ్యేలా ... రెండు చేతులు పైకెత్తి ... తలమీద దుప్పటి లాంటి ఎర్రటి ముసుగుని సవరించు కొంటూంది తను ... సూర్యుడి సన్నటి చూపు తన ముక్కుమీద సిల్వర్ నత్తులో మెరిసింది... అంత కన్నా అందంగా మెరిశాయి తన కళ్ళు... ఏం గుర్తు వచ్చిందో ఏమో వెలుగుని చూస్తూ ఫక్కుమని నవ్వుకుంది తను... రెండు బుగ్గల్లోను లోతుగా అందం గుంటలు పడింది ... గుండె మీద పూసలు ఎత్తుగా స్వేచ్ఛగా ఎగిరిపడ్డాయి...

ఇవన్నీ కనపడలేదు నా కప్పుడు... పీటిలో ఏదో ఒకటి కనిపించింది అన్నీ స్ఫురించేలా ...

తనని చూడాలంటే మొత్తం అరుగు మీద గుంపు వంతటినీ వెతక వలసి వచ్చేది ... మరీ పొద్దున్న కొద్ది సేపు తప్ప పగలంతా కనపడేదికాదు. తనే కాదు, గుంపులో ఎవరూ కన పడరు. మళ్ళీ సాయంత్రం చీకట్లు తరిమేటప్పుడు కనపడేది కాస్సేపు ... అందుకనే నాకు తను ... తనతోపాటు వాళ్ళూ చీకట్లో కూడా గుర్తే.

ఇళ్లలో పోర్షన్స్‌లా, గుంపులో జట్లున్నాయి. తనెప్పుడూ వాడితోటే కనపడేది. బాగా సాగదీసిన రాగితీగలా ఎర్రగా ఉండేవాడు. ఎవరో పిలిచి నప్పుడు విన్నాను, పేరు లచ్చుమయ్యట ... వాడి జుట్టు కూడా రాగి రంగులోనే ఉండేది. సంవత్సరాలుగా మట్టి తట్టలు, ఇటుకలు ఎత్తి నెత్తిమీద మోయటం వల్ల జుట్టు అలా అయిందేమో అనిపించింది. ఒంటి మీద ముతక బనీను... మోకాళ్ల వరకూ పంచె... చేతికి తెల్లటి కడియం ... ముక్కుకి రాగిపోగు ... తలకి ఎప్పుడూ చుట్టుకునే ఎర్రగళ్ల సన్నగుడ్డ... పెదవిలో ఆకుచుట్ట... తన పక్కన గుమ్ముత్తుగా ఉండేవాడు... తనని వాడు చూస్తూంటే ఎంతో ప్రేమగా ఉండేది.

మా వీధిలో ఎన్నోరకాల ఇళ్లు న్నాయి. అంతకన్నా ఎన్నో రకాల మనుషులున్నారు. కాని దీనికి సంబం ధించినంత వరకు అరుక్కి ఎదురుగా ఉండే మేడ గురించే చెప్పుకోవాలి. అందులో ఎవరో అమెరికన్స్ ఉంటు న్నారు. సాయంత్రం పూట పద్దెనిమి దేళ్ల వాళ్ల పిల్ల స్కర్ట్‌లో బిగుతుగా, తెల్ల గోధుంగింజలా ఆరోగ్యాన్ని పిటపిటలాడిస్తూ పచారు చేస్తూం టుంది. కాలుస్తున్న సిగరెట్ నుసితో పాటుగా, చూపుల్ని కూడా కింద అరుగు వేపు రాలుస్తూ ఉంటుంది. ఆ మేడ గురించి చెప్పుకోవటం రవి గురించే.

రవి బొమ్మలు వేస్తాడు. అందాన్ని గీస్తానంటాడు. వాడూ చూశా డొక సారి అరుగు మీద తనని.

"పూసల్లో, కడియాల్లో ఈ లంబాడీ వాళ్లని చూస్తుంటే పిచ్చెక్కుతుంది, తెలుసా?" అన్నాడు.

ఇంత హడావిడిగా ఒకళ్ల నొకళ్లు ఒరుసుకుంటూ గడిపే నగర జీవి తంలో కేవలం వాళ్ల వరకే వాళ్లు. ఆదివిలో ఉండే ఓ తెగలా కాలం గడుపుతూ వీళ్లు ఒక్కళ్ళే కనిపిస్తారు.


పగలంతా ఎండలోనూ, దుమ్ము లోనూ గొడ్ల గుంపులా పనిచేయటం... రాత్రి కాగానే అరుగుల పక్కన ఎర్రటి మంటల ముందు ఆనందాన్ని తుళ్లుతూ నవ్వుతూ పంచుకోటం ... అది వాళ్ల జీవితం. అందరూ కష్టపడతారు. కలిసి తింటారు. అందుకనే ఆనందం వాళ్లది.

తలుచుకున్నప్పుడల్లా వీళ్లు నలుగురి తోనూ అందరిలాగే కలిసిపోతే బాగుండు ననిపిస్తుంది.

ఇదివరకు లచ్చుమయ్య తండ్రి మట్టి మోసి ఉంటాడు. ఇప్పుడు లచ్చుమయ్య మోస్తున్నాడు. రేపు లచ్చుమయ్య కొడుకు ఇంతేనా ...

"ఏదేనా రూము చూడకూడదు ఖాళీగా ..." అన్నాడు రవి ఈమధ్యన.

"ఎందుకు?" అంటే అయిదు రూపాయిలిచ్చి తనని తీసుకెళ్లటాని కన్నాడు ... న్యూడ్ పోజ్ కోసం ... మోడల్‌గా ...



ఊహా ఏహా

ఫోటో — ఎస్. ముఖర్జీ (ఆగ్రా)

రవి ఎప్పుడూ తనొక్కడాన్నే చూసే వాడు. గుంపుని చూసేవాడు కాదు. కాని నాకు తనతోపాటు గుంపునికూడా చూడడం అలవాటయింది. ఆ అరుగు మీద ఆ గుంపునే కాదు, ఇంకా చాలా అరుగుల మీద ... చాలా గుంపుల్ని...

సిటీలో చాలాచోట్ల కొత్తగా కడుతున్న బిల్డింగుల దగ్గిర రాళ్లు మోస్తూనో, నీళ్లు మోస్తూనో, సిమెంటు కలుపుతూనో కనపడే వాళ్ళు. వాళ్లలో వాళ్లుకాక, బయటి వాళ్లెవరితోనూ కలివిడిగా మాట్లా డుతూ ఏనాడూ కనపడలేదు. వాళ్ల తీరు వేరు. వాళ్ళ వేరు. వాళ్ల భాష వేరు.

"ఈ ఆడాళ్ల దగ్గిర దారుణమైన రోగా లుంటాయట, నీకు తెలుసా?" అన్నాడు రవి ఇంకోనాడు.

ఈ మాట నేనూ విన్నాను చాలా సార్లు. కష్టపడే బలమైన ఆ శరీ రాల్లో రోగాలు నిలవలేవు... కాని వాళ్లలో ఉన్న అమాయికత్వంచుట్టూ కమ్ముకున్నాయి రోగాలు. వంశాను గతంగా వచ్చే రోగా లుంటాయని,వాటిని బాగు చేసుకోటానికి మందులుంటా యని తెలియని వాళ్ల అజ్ఞానం

అరుగుకి ఎదురుగా ఉన్న అమెరి కన్ అమ్మాయి మీది కెందుకు పోలేదో రవి దృష్టి, ఇలా తన వేపు మొగ్గిందని పించింది నాకు.

గుంపులో మిగిలిన మగాళ్లందరిలా ఉండేవాడు కాదు లచ్చుమయ్య ... పని లేనప్పుడు మిగిలినవాళ్లు బద్ధకంగా దొర్లుతూనో, లేకపోతే రాగితీగల తుట్టలా ఉండే తలలో, ఆడళ్లచేత పేలు చూపించుకుంటూనో ఉండేవారు. లచ్చుమయ్య మటుకు అరుగు చివర కూచుని ఆకాశంలోకి, వెలుగులోకి చూస్తూ ఏదో ఆలోచిస్తూండేవాడు.

ఒకసారి వీథి చివర రిక్షావాడితో మాట్లాడుతూ కనిపించాడు. వాళ్లని దాటుతూ వెళ్లిపోతుంటే ఆ ఒక్క మాట వినిపించింది నాకు.

"అయితే ఆరు రోజులు రిక్షా తొక్కితే ... ఏడో రోజు కిరాయిలేదా రిక్షాకి..." అంటున్నాడు గొప్ప అద్భుతంలా ఆశ్చర్యపోతూ లచ్చుమయ్య.

రిక్షావాడు వాడి ఆశ్చర్యానికి ఫక్కుమని నవ్వాడు.

అవును, లచ్చుమయ్యకేం తెలుసు, ఆరు రోజులు శ్రమించినవాడికి వారంలో ఏడో రోజు సెలవుండాలని? రోజంతా పనిచేసి కూలి తీసుకోవటమే కాక, ఆ కూలీ విధానాన్ని కాపాడే రూల్సున్నాయని, వాటికి కూడా కోర్టులు, మోసాలు, లంచాలు అన్నీ యథా విధిగా ఉన్నాయని వాడికేం తెలుసు?

వాళ్ల గుంపులో తెలిసి ఉన్న దొక్కటే. పని దొరకని రోజు బద్ధకంగా అరుగుమీద దొర్లటమే సెలవు. దానికి ఓ గడువు లేదు. ఒక్కోసారి నెలల తరబడి ఉండకపోవచ్చు. మరోసారి వారానికి రెండు మూడు రోజులు రావచ్చు.

మరో నెల గడిచింది.

అరుగు కెదురుగా మేడ టెర్రెస్ మీద అమెరికనమ్మాయి సాయంత్రం పూట పచార్లు చేస్తూ సిగరెట్లు కాలుస్తూనే ఉంది.

ఇదివరకంతగా కాకపోయినా అర్ధ రాత్రుళ్లు ఆ ఆలోచన నన్ను తింటూనే ఉంది.

కాని లచ్చుమయ్యే ఎక్కువగా రిక్షా వాడితో కనిపిస్తున్నాడు ఈమధ్య.

ఓ రోజు నేననుకున్నంతా అయింది. బస్సుకోసం ఎదురుచూస్తూ నిల బడ్డాను నేను.

ఎదురుగా రిక్షా తొక్కుకుంటూ వస్తున్నాడు లచ్చుమయ్య. రిక్షాలో మనుషులున్నారు. హుషారుగా తొక్కుతున్నాడు. నన్ను చూసి చిన్నగా నవ్వాడు. గర్వంగా ఉంది ఆ నవ్వు. అందులో ఉత్సాహం ఉంది; కలుపుగోరుతనం ఉంది.

ఆ నవ్వుని లందరూ గుర్తుపట్టగలరు దృష్టి ఉంటే ... ఆ మార్పు అందరికీ తెలుస్తుంది. జీవితం సంఘంలో పొందుతున్న మార్పది. ఇంకా ఎంతో తొందరగా అందరిలోనూ రావలసిన మార్పది.

కేవలం కూలిచేసుకునే ఓ లంబాడీ వాడు రిక్షావాడుగా మారటమేకాదు, ఓ తెగ కొత్త జీవితానికి నాందికావచ్చు అది. ముందుకు సాగినవాడు, వెనక బడిన వాడికి అందివ్వవలసిన విజ్ఞానాన్ని జీవితమే అందిస్తున్న తీరు కావచ్చది.



**వెలుగునీడలు** — ఫోటో — ఎమ్. ఆర్. వెంకట్రమణన్ (మద్రాసు - 4)

లచ్చుమయ్య రిక్షా నన్ను దాటుకు వెళ్లిపోయింది. కాని నా ఆలోచన నాలో కదులుతూనే ఉంది. లచ్చుమయ్యకి కూడా ఇంక చాలా మందిలాగే వారంలో ఏడో రోజు సెలవుంటుంది. నెమ్మదిగా అరుగుబతుకు మానేసి తనతో ఏదో చిన్న గుడిసెలోకి మారిపోతాడు.

తను రోజూ సాయంత్రం వాడి కోసం పొద్దుటినించి వాడితో చెప్పాలనుకున్న ఊసులన్నీ మనసులో చోటు చాలక, గుండెలమీద పూసల్ని ఎగరేస్తుంటే, సంజెచీకట్లలో వాడి రాక కోసం గుడిసె గుమ్మం దగ్గిర ఎదురు చూస్తూ ...

లచ్చుమయ్య ఆ అరుగు మీద ఆ తెగవాళ్లందరి బ్రతుకుల్ని తన రిక్షాలో వేసుకుని, వాళ్లకి గూరంగా ఉన్న సంఘంలోకి తీసుకువెళ్లి నలుగురితో పెనవేస్తాడు.

తను లచ్చుమయ్యతో ఏ అరుగు నీడనో కాకుండా, ఓ గుడిసె కప్పు కింద బతికితే రవి దృష్టి లనని నగ్నంగా నిలబెట్టడానికి అయిదు రూపాయల విలవే కట్ట దింక ...

తను లక్కడ లేకపోతే నా దృష్టికి ఆ అరుగు ఖాళీగా కనిపించి, యౌవనం ఒళ్లు విరుచుకుంటూ పిరికిగా, నీచంగా తనని ఆలంబన చేసుకున్న ఆ ఆలోచన నన్ను తిన దింక! ... ★